రాజంపేటలో చంద్రబాబు జన్మదినోత్సవ వేడుకల్లో కేక్ కట్ చేసి పంచిపెడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు



చంద్రబాబు వల్లే తెలుగు రాష్ట్రాలకు గుర్తింపు

● టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనాదక్షత వల్లే దేశంలోను, ప్రపంచంలోను తెలుగు రాష్ట్రాలకు గుర్తింపు ఉందని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. అంతకుముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, నవ్యాంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా కొనసాగుతూ తెలుగు రాష్ట్రాలను అన్ని రంగాల్లో అభివృద్ధిపరచి నేడు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చారన్నారు. కార్యక్రమంలో రాజంపేట రూరల్ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు వీఆర్ఎల్ మణి, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్, రాష్ట్ర క్షత్రియ సంఘ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, జిల్లా డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు గీతాంజలి రమణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ఇడిమడకల కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతునాయుడు, జిల్లా బీసీ నాయకులు మనుబోలు వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యంనాయుడు, బాపనయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు నాయకత్వం వర్ధిల్లాలని, నారా లోకేశ్ నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు చెక్కు అందజేస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు



పాఠశాల అభివృద్ధికి రూ.6 లక్షల విరాళం

● హెచ్‌ఎంకు చెక్కు అందజేసిన దగ్గుబాటి వెంకటేశ్వరరావు

కలకడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కలకడ మండలం బాటవారిపల్లె జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి టీడీపీ సీనియర్ నాయకుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు రూ.6 లక్షలు విరాళంగా ఇచ్చారు. నారా చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం సరస్వతమ్మకు చెక్కు అందజేశారు. నిధులను పాఠశాల ముఖద్వారం ఆర్చి, ప్రహరీ పనులకు వినియోగించుకోవాలని హెచ్‌ఎంకు తెలిపారు. అదేవిధంగా కేక్‌ను 90 ఏళ్ల వయస్సుగల దగ్గుబాటి తండ్రి వెంకట్రాయులు చేత కట్ చేయించి సంబరాలు జరుపుకున్నారు. 40 ఏళ్లకు పైబడి ఎలాంటి పదవులు ఆశించకుండానే టీడీపీ మద్దతుదారుడిగా, చంద్రబాబునాయుడుకు వీరాభిమానిగా గుర్తింపు పొందారు. టీడీపీ అధినేత చంద్రబాబును ఆరాధ్యదైవంగా భావించే ఈయన 33 ఏళ్లుగా చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పాటు ఏదో ఒక సామాజిక కార్యక్రమం చేస్తున్నారు. గతంలో చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా వాల్మీకీపురంలో కోదండ రామాలయానికి రూ.1.05 లక్షల విలువ గల బంగారుహారాన్ని వితరణగా ఇచ్చామని, ప్రతి ఏటా ఎన్టీఆర్ ట్రస్టుకు రూ.లక్ష విరాళం, అదేవిధంగా తన కుమారుడి నెల జీతాన్ని ట్రస్టుకు అందచేసినట్లు దగ్గుబాటి తెలిపారు. కార్యక్రమంలో కేఎస్ఎస్ ప్రసాద్, పునీత్‌చౌదరి, శారదమ్మ, సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు తండ్రి వెంకట్రాయులు


నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల 21వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.



నిరుద్యోగుల కల.. తీరనున్న వేళ..



ఏళ్ల తరబడి ఎదురుచూశా..



చాలా ఏళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నా. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక మెగా డీఎస్సీ విడుదల చేయడం ఆనందంగా ఉంది. గత ఐదేళ్లుగా డీఎస్సీ ప్రకటన రాకపోవడంతో చాలామంది నిరుద్యోగులకు న్యాయం జరగలేదు. వయస్సు మించి చాలా మంది అనర్హుగా అయిపోతారేమో అనే భయం ఉండేది. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం చదువుతున్న వాళ్లకు మంత్రి నారా లోకేశ్ నిర్ణయంతో మేలు జరగనుంది.

- కొత్తకురవ సుభాషిణి, మదనపల్లె

డీఎస్సీపై ఆశలు వదిలేశా..



గత ప్రభుత్వంతో టెట్ పాస య్యాను. డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో జీవనం సాగించడానికి పానీపూరి సెంటర్ నిర్వహిస్తున్నా. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారాలోకేశ్‌లు రాష్ట్రంలో 16 వేలకు పైగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఇక కష్టాలు తీరినట్లే. ఏదోలా కష్టపడి చదివి ఉద్యోగం సాధిస్తా. ఇంత గొప్ప నోటిఫికేషన్ ఇచ్చిన ఏపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- రొద్దా మణికంఠ, మదనపల్లె

ఐదు సంవత్సరాల నిరీక్షణ ఫలించింది...



డీఎస్సీ నోటిఫికేషన్ కోసం నేను ఐదు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నాను. వేలకు వేలు కట్టి గత ఐదేళ్ల కోచింగ్ తీసుకుని సిద్ధపడినప్పటికీ నోటిఫికేషన్ రాక భంగపడ్డాను. ఈ అవకాశం సద్వినియోగం చేసుకుంటా.

- నస్రున్, పీలేరు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో.. ఉన్నత చదువులు చదివి.. వేలాది రూపాయలు ఖర్చు చేసి కోచింగ్‌లు తీసుకున్న నిరుద్యోగుల ఏళ్ల నాటి కల కూటమి ప్రభుత్వంలో తీరనుంది. యువగళం పాదయాత్ర సందర్భంగా తనను కలిసిన వేలాది మంది నిరుద్యోగులకు మాట ఇచ్చిన నారా లోకేశ్ తన మాట నిలబెట్టుకుంటూ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినం రోజున రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 16 వేలకు పైగా పోస్టుల భర్తీ కోసం ఈ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో నిరుద్యోగుల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటిస్తానని ఎన్నికల్లో పబ్బం గడుపుకున్న జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే నిరుద్యోగులను నట్టేట ముంచారు. తాము అధికారలంలో ఉన్న ఐదేళ్లు డీఎస్సీ గురించి ఊసే ఎత్తలేదు. దీంతో వేలాది మంది నిరుద్యోగులు వయస్సు అర్హతను కోల్పోయారు పరీక్షను రాసే అవకాశాన్ని కోల్పోయారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఇటువంటి నిరుద్యోగుల సమస్యను మానవతా దృక్పదంతో పరిశీలించి పరీక్ష రాసేందుకు వయస్సు గడువును పెంచింది. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగులు డీఎస్సీ పరీక్షను రాసే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఇంతటి గొప్ప అవకాశాన్ని

● ఆరేళ్ల తర్వాత మెగా డీఎస్సీ

● మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వ రుణాన్ని తీర్చుకోలేమని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అన్నమయ్య జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలు ఇప్పటికీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్నాయి. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరులు ఉమ్మడి కడప జిల్లాలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్-1 38, లాంగ్వేజ్ హిందీ 17, ఇంగ్లీషు 104, మ్యాథ్స్ 30, ఫిజిక్స్ 29, బయాలజీ 63, సోషియల్ 130, పీఈటీ 86, ఎస్జీటీ 976 కలిపి 1473 పోస్టులు ఉన్నాయి. ఉమ్మడి కడప జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్-1 34, హిందీ 18, ఇంగ్లీషు 81, మ్యాథ్స్ 44, ఫిజిక్స్ 30 బయాలజి 53, సోషియల్ 65, పీఈటీ 82, ఎస్జీటీ 298 కలిసి 709 పోస్టులు ఉన్నాయి.

● మెగా డీఎస్సీ -2025 పరీక్ష షెడ్యూల్

నోటిఫికేషన్ జారీ సమాచార బులెటిన్ ప్రచురణ:	20.04.2025
ఆన్‌లైన్ ద్వారా ఫీజులు చెల్లింపు, అప్లికేషన్ గడువు:	20.04.2025-15.05.2025
మాక్ టెస్ట్	20.05.2025
హాల్‌టికెట్లు డౌన్‌లోడ్:	30.05.2025 నుంచి
పరీక్షలు	06.06.2025 - 06.07.2025 వరకు
ప్రాథమిక కీ విడుదల:	అన్ని పరీక్షలు పూర్తైన రెండో రోజున
అభ్యంతరాల స్వీకరణ:	ప్రాథమిక కీ విడుదల అనంతరం ఏడురోజుల పాటు
తుది కీ విడుదల:	అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన ఏడు రోజులకు
మెరిట్ జాబితా విడుదల:	తుది కీ విడుదలైన ఏడు రోజుల తర్వాత

కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటా..



నేను హిందీ పండిట్ ట్రైనింగ్ చేశాను. రెండు సార్లు డీఎస్సీ రాశాను. ఒకసారి ఒక మార్కు, ఇంకోసారి రెండు మార్కుల తేడాలో ఉద్యోగం కోల్పోయాను. ఐదు సంవత్సరాలు డీఎస్సీ కోసం వేచి చూసినప్పటికీ నోటిఫికేషన్ రాకపోవడంతో వయస్సు పెరిగిపోయింది. అయితే కూటమి ప్రభుత్వం వయస్సును పెంచడంతో నాకు పరీక్షను రాసే అవకాశం వచ్చింది. ఈ అవకాశాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకుంటా.. నాకు మరో అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

- షేక్ ఖాదర్‌బాషు, పీలేరు

నారా లోకేశ్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



డీఎస్సీ నోటిఫికేషన్ కోసం గత ఐదేళ్లు నిరీక్షించాను. పాదయాత్ర సమయంలో డీఎస్సీపై నారా లోకేశ్ హామీ ఇవ్వడంతో సంతోషించాను. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు దానిని నిలబెట్టుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగం సాధిస్తాను.

- మునికుమారి, పీలేరు

పోస్టులు పెంచి ఉంటే బాగుండేది..



నారా లోకేశ్ ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం సంతోషం. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేవలం 30 మాత్రమే ఉన్నాయి. వీటిని మరి కొన్ని పెంచి ఉంటే బాగుండేది.

- శివకుమార్, పీలేరు

కడప జిల్లాలో సుర్రుమన్న సూరీడు

● అత్యధికంగా ముద్దనూరులో 42.3, బద్వేలులో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు



కడప (కలెక్టరేట్), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కడపజిల్లా వ్యాప్తంగా ఆదివారం భానుడి భగభగలతో ఎండలు మండాయి. జిల్లాలో 36 మండలాలు ఉండగా అందులో 28 మండలాల్లో 40 డిగ్రీల నుంచి 42.3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అందులో అత్యధికంగా ముద్దనూరు మండలంలో 42.3 డిగ్రీలు, బద్వేలు మండలంలో 42 డిగ్రీల వరకు నమోదైంది. ఈ వేసవి ఆరంభం నుంచి అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. కాగా మంగళ, బుధవారాల్లో ఇంతకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ మేరకు ఏపీ విపత్తుల శాఖ హెచ్చరికలు జారీ చేసింది. కాగా యర్రగుంట్ల, కమలాపురంలో 41.7, కడప, పెండ్లిమర్రిలో 41.5, అట్లూరులో 41.4, పెద్దముడియంలో 41.3, వేంపల్లి, సింహాద్రిపురంలో 41.1, జమ్మలమడుగు 41, వల్లూరు 40.3, తొండూరు, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో 40.5 డిగ్రీలు, రాజుపాలెం 40.2 పోరుమామిళ్ల 40.4, ఖాజీపేట 40.3, కలసపాడు 40.4, దువ్వూరు 402, గోపవరం 40, సీకేదిన్నె 40.5, చెన్నూరు 40.5, చాపాడులో 40.6, చక్రాయపేట 40.1, బి.కోడూరు 40.3, డిగ్రీల ఉష్ణోగ్రతలు, వేడిగాలులతో ఉక్కపోతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మిగతా మండలాల్లో ఉష్ణోగ్రతలు 38.9 నుంచి 39.9 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఒత్తిడిని తగ్గించేందుకు విశ్రాంతి రూములు

● ఏడీఆర్ఎం సుధాకర్

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): లోకో పైలట్స్‌కు, గార్డ్స్‌కు ఒత్తిడిని తగ్గించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విశ్రాంతికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు గుంతకల్ రైల్వే ఏడీఆర్ఎం సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఎర్రగుంట్లలో ఉన్న రన్నింగ్ రూమును ఎస్ఎంఆర్ మోహన్‌రెడ్డి, సీనియర్ డీఈఈ వీరయ్య ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రన్నింగ్ రూంలోని ఏర్పాట్లును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ 8గంటల పాటు పైలట్స్ అవిశ్రాంతంగా పనిచేస్తుంటారని, వారిని ఒత్తిడి నుంచి దూరం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 2022లో రూ.97 లక్షలతో కింది ఫ్లోర్‌ను నిర్మించామని, సిబ్బంది మరింత పెరగడంతో రూ.1.37 లక్షలతో ఫస్ట్ ఫ్లోర్ నిర్మించామన్నారు. మంచి ఆహారం, యోగా, గార్డెనింగ్, రీడింగ్ రూం, ఏసీతో కూడిన సపరేట్ బెడ్, పార్కు, ఫుట్‌మసాజ్, సెమినార్ హాలు, వాహనాలు ఆపుకునేందుకు పార్కింగ్ ప్లేస్ వంటివి వారికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎర్రగుంట్లలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పొడిగింపును రూ.60 లక్షలతో ఏర్పాటు చేశామని, అది జూన్ నాటికి పూర్తవుతుందన్నారు. మరిన్ని సౌకర్యాలు కూడా కల్పించబోతున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో చీఫ్ క్రూ కంట్రోలర్ సద్దుసాహెబ్, ఏడీఈఎన్ రాధాక్రిష్ణ, ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్ బాబాజాన్, మధుసూదన్, వీఎస్ రాజు, సీసీఐ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



రన్నింగ్ రూంను పరిశీలిస్తున్న ఏడీఆర్ఎం

ఎన్‌డీఏకు సైనిక్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

కలికిరి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కలికిరి సైనిక్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు నేషనల్ డిఫెన్స్ అకాడమీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గ్రూప్ కెప్టెన్ పరదేశి తెలిపారు. 12వ తరగతి విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన ఎన్డీఏ ప్రవేశ పరీక్షల్లో ఈ నలుగురు ప్రవేశాలకు అర్హత సాధించినట్లు చెప్పారు. మంగదొడ్డి అంకిత్ యాదవ్ (ఎయిర్‌ఫోర్స్-ఫ్లై), బి.శ్రీరామ్ (ఆర్మీ), నల్లా శ్రేయాస్ రెడ్డి (ఎయిర్‌ఫోర్స్-ఫ్లై), గాండ్ల వినయ్‌కుమార్ (ఎయిర్‌ఫోర్స్-జీడి)లు ఎంపికైనట్లు చెప్పారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన ఫలితాల అనంతరం సర్వీసెస్ సెలెక్షన్ బోర్డు మొత్తం 400 లోపు టాప్ ర్యాంకర్ల జాబితాను ప్రకటించగా అందులో ఈ నలుగురు చోటు దక్కించుకున్నారని పరదేశి వివరించారు. ఇప్పటి వరకు ఐదు బ్యాచ్‌ల ద్వారా మొత్తం 26 మంది ఎన్డీఏలో సీట్లు పొందారని తెలిపారు. అంకితభావంతో కూడిన శిక్షణ కారణంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఉదయం అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం పరిమళభరిత పుష్పాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



రిజర్వాయర్ వద్ద ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా

మా ఇష్టం తోలేస్తాం..

● రిజర్వాయర్‌లో వద్దంటే వినరే..

● సెలవు రోజుల్లో అక్రమంగా ఇసుక రవాణా

వాల్మీకిపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అధికారం మాది ఇసుక తోలుకుంటాం ఏమైనా చేస్తాం అన్న చందంగా తయారైన పరిస్థితులపై వాల్మీకిపురం పట్టణంలో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే దిశగా అధికారులు గత కొద్ది రోజులుగా చర్యలు తీసుకుంటున్నప్పటికీ సెలవు రోజుల్లో ఇసుకాసురులు రెచ్చిపోతుండటం గమనార్హం. వాల్మీకిపురం పట్టణానికి తాగునీటి సరఫరా చేసే వ్యవసాయ బావుల ప్రాంతాల వద్ద ఇసుక తవ్వకాలు జరపరాదని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ సెలవు రోజుల్లో ఇసుక మాఫియా ఆగడాలు మాత్రం తగ్గడం లేదు. ఆదివారం స్థానిక భోగంపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరిగింది. ఈ విషయాన్ని



వాల్మీకిపురం భోగంపల్లె రిజర్వాయర్‌లో ఇసుక అక్రమ తవ్వకాలు

సమీప ప్రాంతాల రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు మాత్రం అంతంత మాత్రమే అన్న విమర్శలు వచ్చాయి. రిజర్వాయర్ ప్రాంతంలోని మొరవ ప్రాంతం పూర్తిగా మట్టితో కప్పివేసి ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. రిజర్వాయర్ నుంచి ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతూ నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి గుండా నిత్యం ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా తరలిపోతోంది. ఈ విషయమై ఆదివారం సమీప ప్రాంతాల రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు రిజర్వాయర్ వద్దకు చేరుకునేలోపే ట్రాక్టర్లతో అక్కడి నుంచి ఉడాయించినట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు.

భోగంపల్లె రిజర్వాయర్‌లో ఏర్పడ్డ గోతులు



ఆనందోత్సాహాలతో ఈస్టర్ వేడుకలు



పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పీలేరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు పునరుత్థానం పొందిన ఈస్టర్ దినోత్సవాన్ని పీలేరు మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రపంచానికి శాంతి, ప్రేమను బోధించిన ఏసుక్రీస్తును శిలువ వేయడాన్ని గుడ్‌ఫ్రైడేగా శుక్రవారం బాధాతప్త హృదయాలతో జరుపుకున్న క్రైస్తవులు ఆయన సమాధిలో నుంచి మూడు రోజుల తరువాత పునరుత్థానం పొందిన ఈస్టర్‌ను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈస్టర్ సండే సందర్భంగా పట్టణంలోని అధిక శాతం క్రైస్తవులు ఆదివారం వేకువజామున తమ పూర్వీకుల సమాధుల వద్దకు చేరుకుని వారి ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం తమ సమీప ప్రాంతాల్లోని చర్చిలు, ప్రార్థనా మందిరాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈస్టర్ సందర్భంగా పట్టణంతో పాటు మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న ప్రార్థనా మందిరాలు కిటకిటలాడాయి.

వైభవంగా ముక్తిరామలింగేశ్వరస్వామి రథోత్సవం



ముక్తిరామలింగేశ్వరస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం సైకత లింగానికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి, చండీమాతకు, ఆది శంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీ చక్రానికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజల అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం గంగా రాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామిని శోభాయమానంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. పురవీధుల్లో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తుల శివ నామస్మరణలతో పురవీధులు మారుమ్రోగాయి. డప్పు వాయిద్యాల సందడి, కోలాటం, కళాకారుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కార్యక్రమంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ప్రొద్దుటూరు ఫస్ట్ అడిషనల్ జడ్జి కె.సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారురెడ్డి, ఆలయ చైర్మన్ రాజారెడ్డి, కౌన్సిలర్ వంశీధర్‌రెడ్డి, టీడీపీ మాజీ సభ్యుడు టంగుటూరు మారుతీప్రసాద్, ఆలయ ఈవో శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు.

కాశినాయన జడ్పీటీసీనా.. మజాకా..!

- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తమ్ముళ్ల భూ కబ్జాపై ముమ్మర దర్యాప్తు
- నాడు 'ఆంధ్రజ్యోతి' చెప్పింది అక్షర సత్యం
- రెండ్రోజులుగా డ్రోన్‌లతో పరిశీలన
- ఆక్రమణ దారుల చెరలో 316 ఎకరాలు ఉన్నట్లు ప్రాథమిక నివేదిక
- కబ్జాభూముల్లో జలకళ బోర్లు, కరెంట్ సర్వీసుల గుర్తింపు
- మాజీ సైనికులంటూ బోగస్ పేర్లతో పాగా
- సహకరించిన అధికారులపై ఆరా

కాశినాయన ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో భూ కబ్జాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. వంక, కొండ పోరంబోకులు, డీకేటీలు ఏది కంటబడినా కాజేయాలిందే అన్నట్లుగా సాగింది నాటి పాలన.. నాయనపల్లె సమీపంలోగల సర్వేనెంబర్ 128, 129(1),130లోగల దాదాపు 600 ఎకరాల కొండపోరం బోకు భూమి ఉంది. ఈభూముల్లో వైసీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కుటుంబీకులు కబ్జాకు తెరలేపారు. ఈవిషయం గత సెప్టెంబరులోనే ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. నాటి అధికారులు నేతల ఒత్తిళ్లకు తలొగ్గి ఆభూముల్లో హెచ్చరిక బోర్డులు నాటి వదిలేశారే తప్ప కాపాడలేకపోయారు. ఈ ప్రభుత్వ భూములపై ఎమ్మెల్సీ గోవిందరెడ్డి తమ్ముడు జడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి తన పెద్దనాయన కుమారుడు పెద్ద సత్యంరెడ్డిల కన్నుపడింది. అనుకున్నదే తడువుగా హెచ్చరిక బోర్డులు పీకేశారు. బోగస్ పత్రాలు సృష్టించి బినామీలతో ఆర్మీ పట్టాలు తయారు చేసి కబ్జాలకు పాల్పడ్డారు. పగలు రాత్రనక యంత్రాలతో చెట్లు పీకించి వందల ఎకరాలు చదును చేశారు. వారితోపాటు నాయనపల్లె క్రిష్ణయ్య కుటుంబీకులు, ఆర్ల చెన్నయ్య, తోడేటి ప్రసాద్, కాశయ్య, సర్వేశ్వర్‌రెడ్డి మరి కొంతమంది భూములు ఆక్రమించు కు న్నారు. నాయనపల్లె సమీపంలోని సాలెన్ చెరువు, అడవుల్లోకి పశువులు మేతలకు పోయేదారులను సహితం వదలలేదు. ఇంత జరుగుతున్నా నాటి అధికారులు అటువైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేకపోయారు. గత ఐదేళ్ల కాలంలో వారికి నచ్చిన వ్యక్తిని డీటీగా వేయించుకోవడం అతనికే తహసీల్దారుగా అదనపు బాధ్యలు ఇప్పించుకోవడం మాట వినకపోతే నయానో భయానో పనులు చక్కబెట్టుకొచ్చారు. ఈ భూదందాపై స్థానికలు, అధికారులు ఏమిచేయలేక చేతులెత్తేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారి భూ కబ్జాలపై స్థానికులు జిల్లా అధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాలతో బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ రంగంలోకి దిగారు. పండుగలు సెలవులు పక్కన బెట్టి గత మూడు నాలుగు రోజులుగా రెవెన్యూ అధికారులు నాయనపల్లె సమీపంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను పరిశీలించారు. దాదాపు 316 ఎకరాలు కబ్జా అయిందని అధికారులు తేల్చారు. 316 ఎకరాలు కబ్జా అయినట్లు ప్రాథమిక నివేదిక జిల్లా అధికారులకు ఇచ్చామని.. ఆదివారం కూడా డ్రోన్ సాయంతో సమగ్ర సర్వే చేస్తున్నామని.. కబ్జా ఈవిస్తీర్ణం మరింత ఎక్కువగా ఉంటుందని తహసీల్దారు వెంకటసుబ్బయ్య తెలిపారు. అధికారుల పరిశీలనలో ప్రభుత్వ భూముల్లో జలకళ బోర్లు తవ్వించడం, పెద్ద ఎత్తున అడవుల్లో కరెంట్ లైన్‌లు లాగడం, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం లాంటివి గుర్తించారు. ఇవి ఎలా జరిగాయి ఇందుకు ఎవరు సహకరించారు.. ఇంత జరుగుతుంటే అప్పటి తహసీల్దారులు ఇతర రెవెన్యూ అధికారులు, ట్రాన్స్‌కో సిబ్బంది ఏం చేస్తున్నారు.. కబ్జాదారులకు ఎవరెవరు సహకరించారు.. ప్రభుత్వ పథకాలకు కబ్జాఅయిన భూములను ఎలా వర్తింపజేశారు.. అన్న విషయంపై అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈప్రభుత్వ భూముల్లో చాలా వరకు అరటి తోటలు సాగులో ఉండటం గమనార్హం.



కబ్జాకు గురైన భూముల్లో డ్రోన్‌తో సర్వే చేస్తున్న అధికారులు



నాయనపల్లె సమీపంలో ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

హాస్పిటల్ సిబ్బందిపై మండిపడ్డ ఎమ్మెల్యే



ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్య రెడ్డి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కమలాపురం ప్రభుత్వాసుపత్రిలో విధి నిర్వహణలో ఉండాల్సిన సిబ్బంది కంటే తక్కువ ఉండడంతో ఎమ్మెల్యే మండిపడ్డారు. ప్రజలు ఇచ్చే జీతాలు తీసుకుంటూ వైద్యం చేయాల్సిన వైద్య సిబ్బంది వారిని గాలికి వదిలేసి రిజిస్టర్లలో సంతకాలకే పరిమితం కావడాన్ని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మొదటిసారిని ఇలా మళ్లీ పునరావృతం అయితే అధికారులకు తెలిపి చర్యలు తీసుకునేలా చేస్తామని హెచ్చరించారు. ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా బ్రెడ్లు, పండ్లు రోగులకు పంపిణీ చేసేందుకు ఆదివారం ఎమ్మెల్యే ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యం కోసం ప్రజల పట్ల కొందరు దురుసుగా కూడా ప్రవర్తిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని.. అలాంటి వారిని ఉపేక్షించేది లేదదన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఏర్పాటు చేసిన 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభి వృద్ధి చేయాలని ధ్యేయంతో తాము పనిచేస్తుంటే... ఇక్కడ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి... ఇద్దరు మృతి



ఝాన్సీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బద్వేలుటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లె ఫారెస్ట్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడటంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. బద్వేలు నియోజకవర్గ పరిధిలోని అట్లూరు మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన మల్లి రామసుబ్బమ్మ, యానదయ్య కుమారుడు నరసింహ(26), బద్వేలు పట్టణ పరిధిలోని రూపరాంపేట ప్రాంతానికి విజయమ్మ శివ దంపతుల కుమార్తె ఝాన్సీ (25)లు ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో మృతి చెందారు. మృతులు ఇరువురూ శనివారం తమ స్నేహితులతో కలసి పంక్షన్‌కు వెళుతు న్నామంటూ చెప్పి వెళ్లారు. ఆదివారం నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కదిరి నాయుడుపల్లె ప్రధన రహదారిలోని ఫారెస్ట్ ప్రాంతంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి ఝాన్సీ అక్కడికక్కడే మృతి చెందగా, కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న నరసింహులును బాటసారులు 108వాహనం ద్వారా బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలిం చగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతులు ఇరువురూ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో విధులు నిర్వహించేవారు. నరసింహులుకు 8 నెలల క్రితం రాజుపాలెంకు చెందిన కళ్యాణితో వివాహం జరిగింది. దీంతో ఇరువురి కుటుంబాల్లో విషాధచాయలు అలుముకున్నాయి.



నరసింహ (ఫైల్‌ఫొటో)

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

- 75కేజీల కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన బీటెక్ రవి



కేక్ కట్ చేసి బీటెక్ రవికి తినిపిస్తున్న ఆయన సతీమణి లత


పులివెందుల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు పులివెందులలో కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం చంద్రబాబునాయుడు 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని పులివెందుల టీడీపీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఉదయం 9.30గంటల ప్రాంతంలో టీడీపీ కార్యాలయంలో పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి), బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డిలు కలిసి 75కేజీల భారీ కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బీటెక్ రవి సతీమణి లత కేక్ కట్ చేసి బీటెక్ రవికి తినిపించారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు ఆశాకిరణం లాంటివాడన్నారు. ఆయన చేపట్టిన అనేక సంస్కరణలు రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రఘునాథరెడ్డి, వెంకటరామిరెడ్డి, సంజీవరెడ్డి, సిద్దారెడ్డి, సంహాద్రిపురం మార్కెట్ కమిటీకి ఎంపికైన రామసూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ, టీడీపీలు రాష్ట్రానికి రాహు కేతువులు

- పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ, టీడీపీలు రాహు కేతువులుగా దాపురించాయని, దొందూ-దొందేనని రాజ్యసభ మాజీ సభ్యుడు, పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ తన పాలనలో అరచేతిలో వైకుంఠం చూపి తే... చంద్రబాబు కైలాసం చూపిస్తు న్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుంచి నిప్పుల పొయ్యిల పడ్డట్లుగా తయారైందని విమర్శించారు. జగన్ ప్రభు త్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా, అరాచక, ఆటవిక, మద్యం, డ్రగ్స్, గంజాయి ఆంధ్ర ప్రదేశ్‌గా తయారు చేసి వెళ్లి పోయిందన్నారు. ఇక చంద్రబాబు పనితీరు అందుకు భిన్నం కాదని.. మండలానికి నాలుగు మద్యం షాపు లు, బెల్టుషాపుల హోరు సాగుతోందన్నారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్లు అదనపు భారం మోపిం దని, సూపర్ సిక్స్ హామీలు ప్లాప్ అయ్యా యని, నిరుద్యోగ భృతి ఎక్కడంటూ విమ ర్శించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి సీమలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రె స్ కమిటీ ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, ప్రసా ద్‌గౌడ్, ఏకాదశి రెడ్డి, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, రాష్ట్ర మాజీ నేతలు సత్తార్, సుబ్బారెడ్డి, శ్యామలమ్మ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో అపశ్రుతి



ఖాజీపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తుడమలదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకాళమ్మ విగ్రహ ప్రతిష్ఠలో అపశ్రుతి చోటుచేసుకుంది. గుడిని ప్రారంభించి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం గరుడస్తంభం క్రేన్ సహాయంతో ఏర్పాటు చేస్తుండగా ఒక్కసారిగా రెండు ముక్కలై గుడిపై ఒక ముక్క, మరో భాగం నిటారుగా నిలవడంతో భక్తులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా జిల్లా పరిషత్ చైర్మన్ రాంగోవిందురెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నందిపల్లెలో ఘర్షణ

వేంపల్లె, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపల్లెలో ఆదివారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. నందిపల్లెకు చెందిన మున్వర్ ఇంటి వద్దకు పంచాయతీ నెపంతో వీరపునాయునిపల్లె మండలానికి చెందిన చిన్న బాదుల్లా, పెద్దబాదుల్లాతో పాటు వేంపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు అబ్దుల్ వెంట పలు వురు యువకులు వెళ్లారు. ఈ సందర్భంగా వాదోపవాదాలు జరిగి మున్వర్‌తో పాటు బావ, అక్క సలీమ మీద దాడి చేశారు. ఈ ఘటనలో సలీమకు చేయి విరిగింది. ఈ సందర్భంగా గ్రామస్థులు పెద్దఎత్తున చేరుకోవడంతో అక్కడకు వచ్చిన అల్లరి మూక పరారైంది. విషయం తెలుసుకున్న ఎస్ఐలు రంగారావు, తిరుపాల్‌నాయక్‌లు ఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని అదు పులోకి తెచ్చారు. కాగా, దాడిచేసేందుకు వచ్చిన వారిని వదిలివేసిన ఎస్ఐ తీరుపై గ్రామస్థులు అసంతృప్త వ్యక్తం చేశారు.

ఉప మండలాధ్యక్షుడిపై కేసు నమోదు

మైదుకూరు రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్ర జ్యోతి): మైదుకూరు ఉప మండలాధ్యక్షుడు ఊటకూరు రఘురామిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. తువ్వపల్లెకు చెందిన ఓ మైనర్ బాలికకు రఘురామిరెడ్డి ఆశ్రయం ఇచ్చి వివాహం చేయాలని చూశారు. ఈ మేరకు బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన పోలీసులు ఆదివారం రఘురామిరెడ్డిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచినట్లు ఎస్ఐ తెలిపారు.

అర్హులైన ఉద్యోగులకు త్వరలో ఇంటిస్థలాలు

- ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

కడప, కలెక్టరేట్, ఏప్రిల్ 20, (ఆంధ్రజ్యోతి): ఎన్జీవో సంఘంలో దీర్ఘకాలంగా సభ్యత్వం ఉండి, ఇంకా ఇంటి స్థలాలు రాని ఉద్యోగులకు ఇంటి స్థలాలు వచ్చేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం నగరంలో ఎన్జీవో కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ కార్యాలయంలో ఆసంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ స్థలం రాని సభ్యులకు ఇంటి స్థలాలు ఖచ్చితంగా సాధించి అర్హులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి రవికుమార్, హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు కొండారెడ్డి, డైరెక్టర్లు, అధ్యక్ష, కార్యదర్శులు, రిటైర్డ్ ఉద్యోగులు, సభ్యులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు యువకుడు మృతి



భాను ఓబులేసు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

పెద్దముడియం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్నముడియం గ్రామ శివారులో పంట పొలంలో ఆదివారం మధ్యాహ్నం 4గంటల ప్రాంతంలో పిడుగుపాటుకు భాను ఓబులేసు (22) అనే యువకుడు మృతి చెందాడు. జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన దండు నాగసుబ్బరాయుడు అతని కొడుకు భాను ఓబులేసులు తమ పొలంలో సాగు చేసిన కొర్రపంటకు నీరు పెట్టేందుకు ఆదివారం ఉదయం వచ్చారు. మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత పని చేసుకుంటుండగా ఒక్కసారిగా గాలి, వాన రావడంతో ఇంటికి వెళ్లేందుకు సిద్దమయ్యారు. ఆ సమయంలో సమీపంలోని పొలం గట్టు వద్ద పిడుగు పడడంతో భాను ఓబులేసు అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలో ఉన్న తండ్రి కొడుకు చనిపోయి ఉండడం చూసి బోరున విలపించారు. విషయం బంధువులకు తెలపడంతో వారు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కన్నీంటి పర్యంతమయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

జూన్, జూలైలో వైవీయూ స్నాతకోత్సవాలు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం 11, 12, 13, 14వ స్నాతకోత్సవాలను జూన్, జూలై నెలల్లో నిర్వహిస్తున్నట్లు వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు వెల్లడించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాస రావు తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలి పారు. వివరాలకు హెచ్‌టీటీపీ: //కాన్వకేషన్.వైవీయూఎగ్జామ్స్.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

వేడుకగా మారెమ్మతల్లి జాతర

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నిండుకుండ బోనాలు

కడప కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నగర 49వ డివిజన్ ఆలంఖాన్ పల్లెలో వెలసిన మారెమ్మతల్లి ఆలయ 21వ వార్షికోత్సవం సందర్భాన్ని పుర ష్కరించుకుని ఆదివారం జాతర మహోత్సవం వేడుకగా జరిగింది. తెల్ల వారుజాము నుంచే అమ్మవారికి భక్తి శ్రద్ధలతో నిండుకుండ బోనాలు సమ ర్పించి మొక్కుబడులు చెల్లించారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆలయానికి చేరుకుని గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని శరణు కోరారు. అనంత రం ఆలయ కమిటీ సభ్యుడు రెడ్డిచెర్ల జయరామిరెడ్డి పిలుపుమేరకు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు, టీడీపీ యువ నాయకుడు జి.మన్‌మోహన్‌రెడ్డి ఆలయా నికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో వారు పాల్గొన్నారు.



నిండుకుండ బోనాలను సమర్పిస్తున్న మహిళలు

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

జాతర సందర్భంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి గ్రామంలో న్యూ కేటగిరీ విభాగం వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఇందులో ఆలంఖాన్‌పల్లెకు చెందిన రెడ్డిచెర్ల వెంకటరామిరెడ్డి ఎడ్లు ప్రథమ విజేతగా నిలిచి రూ.50వేలు, రూకవారిపల్లెకు చెందిన విద్య ఓబుల్‌రెడ్డి ఎడ్లు ద్వితీయ విజేతగా నిలిచి రూ.40 వేలు, బాలయ్యగారిపల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఎడ్లు తృతీయ విజేతగా నిలిచి రూ.30 వేలు, నాల్గవ విజేతగా సతీష్ కుమార్‌రెడ్డి, ఐదవ విజేతగా విశ్వనాథరెడ్డి, ఆరవ విజేతగా రామ క్రిష్ణారెడ్డి ఎడ్లు నిలిచాయి. వారికి నగదు బహుమతులు అందించారు. అనంతరం సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన కోలాటం ప్రజలను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పెద్దఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

గురు దేవరల ద్వారా భక్తి భావం అలవడుతుంది

గాలివీడు, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): గురుదేవరల ద్వారా ప్రజల్లో భక్తి భావాలు పెంపొందుతాయని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండలంలోని గోపనపల్లె పంచాయతీ పూజారివాండ్లపల్లెలో జరిగిన పెడకంటి నల్లాబత్తిన వంశస్తుల గురువు దేవర మహోత్సవానికి హాజరై ఇరుగులమ్మకు పూజలను నిర్వహించారు. 40 సంవత్సరాల తర్వాత పెడకంటి నల్లాబత్తిన వంశస్తుల ఆధ్వర్యంలో ఇరుగులమ్మ ఇలుగాపులు నిర్వహించిన గురువు దేవరకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఎస్‌ఐ రామక్రిష్ణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లపల్లె గ్రామానికి చెందిన ఎర్రబెల్లి గంగాధర్ (32) అనేవ్యక్తి చికిత్స పొందుతూ కడప రిమ్స్‌లో మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గంగాధర్‌కు 10 సంవత్సరాల క్రితం వల్లూరు మండలానికి చెందిన రెడ్డమ్మతో వివాహమైంది. వీరికి పిల్లలు లేరు. గంగాధర్ మద్యానికి బానిసై ఇరువురు గొడవ పడుతూ ఉండేవారు. 5 సంవత్సరాల క్రితం రెడ్డమ్మ తన పుట్టింటికి వెళ్లిపోయింది. మూడు నెలల క్రితం తన భార్య మరో వివాహం చేసుకున్నదని తెలిసి ఈనెల 17న మామిడితోటలో పురుగు మందు తాగారు. దీంతో కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

గంగమ్మకు పూజలు


అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లె,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం గ్రామంలో వెలిసిన గంగమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పాల్గొని అవ్వమ్మవారికి విల్లు, బోనాలు సమర్పించారు. ఆలయ ఈవో శ్రీనివాసులు భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

కోడూరు చేరుకున్న డ్రైవర్ జోడో యాత్ర

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సేఫ్ డ్రైవర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన డ్రైవర్ జోడో యాత్ర ఆదివారం కోడూరుకు చేరుకుంది. అసోసియేషన్ వ్యవస్థాపకుడు షేక్ అన్వర్ బాషా మాట్లాడుతూ ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్న డ్రైవర్ల కుటుంబాలకు అండగా ఉండాలని ఆయన కోరారు.

మరో రెండు పర్యాయాలు

ముఖ్యమంత్రిగా చంద్రబాబే ఉండాలి

● రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఘనంగా చంద్రబాబునాయుడి పుట్టినరోజు వేడుకలు


రైల్వేకోడూరు పార్టీ కార్యాలయం వద్ద భారీ కేక్‌ను కత్తిరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా


కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, నాయకులు


రాయచోటి: మంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే దిశగా మరో రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడే ఉండాలని జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ రూపానందరెడ్డి తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజపురం గ్రామంలో ఉన్న టీడీపీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టిన రోజు సందర్భంగా భారీ కేక్‌ను కత్తిరించి అభిమానులకు పంచి పెట్టారు. అన్నదానం ఏర్పాటు చేశారు. టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్ రెడ్డి, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, సీనియర్ నాయకులు కట్టా బాలాజీ, కూటమి నాయకులు, కార్యకర్తలు ఐదు మండలాల నుంచి భారీ ఎత్తున తరలి వచ్చి పాల్గొన్నారు.

అభివృద్ధికి మార్గదర్శి చంద్రబాబు: కస్తూరి

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో భారీ కేకును కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, ఓబులవారిపల్లి మాజీ జెడ్పీటీసీ నాయుడోరి రమణ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బాటసారి: పంతగాని

సంక్షేమ పథకాల బాటసారి ముఖ్యమంత్రి చంద్రబాబు అని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ అన్నారు. గాంధీ విగ్రహం ఆవరణలో అన్నదానం నిర్వహించారు.

విజనరీ నేత చంద్రబాబు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): విజనరీ గల నేత చంద్రబాబునాయుడు పాలన ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలవాలని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, అర్చనా విద్యాసంస్థల అధినేత డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మయాదవ్, టీడీపీ మహిళా నేతలు సుజాత, నసీబ్‌జాన్, సుగవాసి విద్యాధర్, చెంగా ఈశ్వరయ్య, టీడీపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

రాజంపేట లీగల్‌సెల్ కార్యాలయంలో...

రాజంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) :రాజంపేట పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి అందరికి పంచిపెట్టారు.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, సీనియర్ నాయకుడు ఎస్వీ రమణ అన్నారు. ఆదివారం సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్‌చేసి అన్నదానం చేశారు. మండల ఉపాధ్యక్షులు మౌలాలి, చాము సుబ్బారెడ్డి, డాక్టర్ శివకుమార్, జి.ఆదినారాయణ, హరినాధ్‌రెడ్డి, శివారెడ్డి, చింతగింజల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి

రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే సాధ్యమని రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య పేర్కొన్నారు. ఆదివారం ఒంటిమిట్టలో చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మామిళ్ల ఈశ్వరయ్య, మోదుగుల నరసింహులు, మునగపాటి వెంకటరమణ, నల్లగొండ వెంకటసుబ్బారెడ్డి, పిడుగు సుబ్బారెడ్డి, బీవీ రమణ, కట్టా సుబ్బరాయుడు, పలుకూరు భాస్కర్, తుమ్మలకుంట ఈశ్వరయ్య, కృష్ణారెడ్డి, వెంకటరమణ, పత్తి క్రిష్ణయ్య, చాన్‌బాషా, షఫీ, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

సిద్దవటం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యమని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి అన్నారు. ఆదివారం గంగమ్మ జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం సత్యశ్రీ చిట్‌ఫండ్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ బాలకృష్ణారెడ్డి ఏర్పాటు చేసిన విందులో ఎమ్మెల్యే టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అనంతరం సీఎం చంద్ర పుట్టినరోజు సందర్భంగా కడప కార్పొరేటర్ లక్ష్మీదేవి స్వగృహంలో భారీగా కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు.

వేడుకలకు సుగవాసి వర్గం దూరం

రాయచోటిటౌన్,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, రాయచోటి నియోకవర్గం టీడీపీ సీనియర్ నాయకుడు సుగవాసి ప్రసాద్‌బాబు వర్గం దూరంగా ఉంది. ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

సీఎం జన్మదినోత్సవానికి రెండు గ్రూపులుగా హాజరు

పెనగలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : సీఎం జన్మదినోత్సవాలకు పెనగలూరు నుంచి తెలుగుతమ్ముళ్లు రెండు గ్రూపులుగా కోడూరుకు చేరుకున్నారు. కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్ కార్యాలయంలో చేపట్టిన కార్యక్రమానికి ఒక గ్రూపు వెళ్లగా మరో సీనియర్ నాయకుడు ఇంకో వర్గాన్ని తయారు చేసి మాజీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడి వర్గంలో పాల్గొనేందుకు వెళ్లారు.

సుండుపల్లె: సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప తెలిపారు. టీడీపీ నాయకులు సుబ్బరామరాజు, సురేశ్‌నాయుడు, ప్రసాద్‌రాజు, సుబ్బరామయ్య, మేకల మహబూబ్‌బాషా, జనార్ధన్ పాల్గొన్నారు.

నందలూరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, నాగిరెడ్డపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ కార్యదర్శి సయ్యద్ అమీర్, టీడీపీ అసెంబ్లీ అధికార ప్రతినిధి వెంకటయ్య అన్నారు. అరవపల్లె పంచాయతీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.

సిద్దవటం: సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. టీడీపీ శ్రేణులు భాకరాపేటలోని పరమాత్మ తపోవన వృద్ధాశ్రమంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: బొమ్మవరం, కమ్మపల్లె గ్రామంలో సీఎం జన్మదినోత్సవం ఘనంగా జరిగింది. సర్పంచ్, మండల ప్రధాన కార్యదర్శి చప్పిడి రమేష్‌బాబు ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు.

రామాపురం:మండలంలోని చిట్లూరు పంచాయతీ ఏకిలపల్లి, రామాపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం.రమేశ్‌రెడ్డి, ఎంఎల్ వెంకట్రామిరెడ్డి, సరస్వతీపల్లె సర్పంచ్ మున్నీర్‌బాషా, రైస్‌మిల్లు వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో భారీగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. టీడీపీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జి చింతపిచ్చల రామకృష్ణగౌడ్, చెన్నక్రిష్ణారెడ్డి, ఎంఎల్ వెంకట్రామిరెడ్డి, దేవదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంబేపల్లె:సంబేపల్లె, పీఎస్‌కాలనీలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.మాజీ జెడ్పీటీసీ మల్లునరసారెడ్డి, పార్టీ మండల అన్నమయ్య జిల్లా కార్యదర్శి కూనాని సుబ్బరాజు యాదవ్, మాజీ సర్పంచ్ గోపాల్, వెంకటయ్య, ఉపసర్పంచ్ హేమంత్‌కుమార్, మండల మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ మునాఫ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వీరబల్లి: సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు మండల శాఖ అధ్యక్షుడు భాను గోపాల్‌రాజు ఆధ్వర్యంలో శ్రీహరి హరాదుల ఆలయంలో అదేవిధంగా మండల సీనియర్ నేత శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో తన స్వగృహంలో వేరు వేరుగా నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లె: మండల ఇన్‌చార్జి యనమల మదన్‌మోహన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. రాజంపేట పార్లమెంట్ డాక్టర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్, సీనియర్ నేత పాపయ్య, మాజీ జెడ్పీటీసీ రెడ్డెన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఒంటిమిట్ట: కేక్ కట్‌చేస్తున్న నాయకులు


కేక్ కట్ చేస్తున్న కొమరా వెంకటనరసయ్య

కనీస వసతులు కల్పించాలి


నిరుపయోగమైన బోరు వద్ద ఖాళీ బిందెలతో ఎస్టీ మహిళలు, సీపీఐ నాయకులు

పెనగలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లపురెడ్డిపల్లె పంచాయతి పరిధిలో గల మండలవారిపల్లె ఎస్టీకాలని ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ నేత జ్యోతి చిన్నయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండలవారిపల్లె ఎస్టీకాలనిలో స్థానిక సీపీఐ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ కాలనీలో సిమెంటురోడ్ల నిర్మాణం జరగలేదని, కరెంటు సదుపాయం లేదని, తాగునీటి వసతి ఇబ్బందిగా ఉందని, ప్రతి కుటుంబానికి ఒకటిన్నర ఎకరా చొప్పున సాగుభూమి ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

జంగాలపల్లెను సందర్శించిన వైద్యసిబ్బంది


రోగులకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

సిద్దవటం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంగాలపల్లెలో విష జ్వరాలపై ఆదివారం వైద్య సిబ్బంది సందర్శించి రోగులకు వైద్యం అందించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం వచ్చిన కథనంపై పి.కొత్తపల్లె ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ మౌలాలి, ఆరోగ్య కార్యకర్త శారదా, ఆశావర్కర్ కళావతి జంగాల రోగులకు మందులు అందించారు. అపరిశుభ్రత ప్రాంతాల్లో బ్లీచింగ్ పిచికారీ చేశారు.

మేడేను విజయవంతం చేయండి

రాజంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మే 1న జరిగే కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సికిందర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతియేడాది మే 1న జరిగే కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి కార్మిక సంఘాలందరూ ఐక్యం కావాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు నాగేశ్వరావు, రమణ, సుబ్రమణ్యం, ఈశ్వరయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

రజక హక్కుల పరిరక్షణ కోసం పోరాటం


మాట్లాడుతున్న రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు

రాయచోటిటౌన్, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): రజక హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తామని అన్నమయ్య జిల్లా రజక సంఘం నేతలు నినదించారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో రజక సంఘం ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రజక సంఘం జిల్లా అధ్యక్షుడు తప్పాయపల్లి రమేశ్‌బాబు మాట్లాడుతూ రజకులు ఎన్నో ఏళ్లుగా దుర్భర జీవితాల్ని గడుపుతున్నారన్నారు. రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజులు, సంబేపల్లె మండల అధ్యక్షులు మధు ఆనంద్, సాంబశివ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు


ములకలచెరువులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేత దొరస్వామినాయుడు, మండల అధ్యక్షుడు పాలగిరి సిద్దా

ములకలచెరువు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా స్థానిక బస్టాండు సర్కిల్‌లో టీడీపీ యువ నేత కట్టా దొరస్వామి నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరిసిద్దా 75 కేజీల కేక్‌ను కట్‌చేసి పంచి పెట్టారు. అనంతరం భారీఎత్తున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు చరపల్లి అనీల్, కట్టా విజయ్ నాయుడు, షేక్ నజీబ్, మేదరమట్ల హరికృష్ణ నాయుడు, చెన్నకిష్టా, వెంకటస్వామి, కేశవులు,నాగరాజుయాదవ్, శంకర్ నారాయణ, శివన్న, గాండ్ల రెడ్డెప్ప, సుధాకర్‌నాయుడు, ప్రతాప్‌నాయుడు, ఉమాశంకర్, జహీర్, కక్కుల సుదర్శన్, బసివి శ్రీనివాసులు, నారాయణ స్వామి నాయుడు, భూపతి, ఆదినారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం


ములకలచెరువులో అన్నదానం చేస్తున్న టీడీపీ నేతలు మల్లికార్జుననాయుడు, గిరిధర్‌రెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా స్థానిక బస్టాండు సర్కిల్‌లో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సీడు మల్లికార్జుననాయుడు, మంత్రి గిరిధర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ అన్నదానం చేశారు. అంతకు మునుపు 75 కేజీల కేక్‌ను కట్ చేశారు. కురబలకోట మండల అధ్యక్షుడు వైజీ సురేంద్రయాద్, కట్టా సురేంద్రనాయుడు, భజంత్రి రామాంజులు, ఆంజనేయరెడ్డి, రెడ్డెప్ప, మొటుకు శివ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.

పేదలకు అల్పాహారం వితరణ

నందలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నందలూరులో ప్రజా సమస్యలపై పోరాడిన ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షుడు, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు దివగంత పోతురాజు మస్తానయ్య ఇటీవల అకాల మరణం చెందగా ఆయన స్మృత్యర్థం నందలూరు లయన్స్‌క్లబ్, వాకర్స్‌క్లబ్, మానవత స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సంయుక్తంగా అరవపల్లె ఆర్‌అండ్‌బి కూడలిలో నివాళులర్పించే కార్యక్రమం ఆదివారం ఏర్పాటు చేశారు. పోతుగుంట రమేష్‌నాయుడు, ఎస్‌ఐ మస్నెం రామమోహన్, కుర్రా మణియాదవ్, ఉప్పుశెట్టి సుధీర్, జంగంశెట్టి సుబ్బయ్య, మోడపోతుల రాము, గంధం గంగాధర్, గురుప్రసాద్, గుండు సురేష్, సునీల్‌రెడ్డి, ఆంజనేయులు, కాకనుర్తి వెంకటయ్య, హిమగిరినాధ్ యాదవ్, ఆదినారాయణ, టీఎన్‌ఎస్ఎఫ్ వేణు, అల్లం అశోక్, వెంకటేశ్, రమేష్ రాయల్, బాలు(అన్నమయ్య స్కూల్) తదితరులు పాల్గొన్నారు.

రామాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దఓరంపాడు గ్రామ పంచాయతీలో సీతారామ సమేత రామాలయంను నూతన ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కూటమి నాయకులు హాజరయ్యారు. జనసేన పార్టీ నాయకుడు తాతంశెట్టి నాగేంద్ర, మైసూరువారిపల్లె సర్పంచ్ సంయుక్త హాజరై పూజలు చేశారు.

వై.కోట గంగమ్మ సేవలో ఎమ్మెల్యే, ముక్కా వరలక్ష్మి

వై.కోట గ్రామంలోని గంగమ్మతల్లిని ప్రభుత్వ విప్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ పార్టీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి దర్శించుకున్నారు.

ఆరీఫ్‌కు నివాళి

చిన్నమండెం, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన లక్కిరెడ్డిపల్లె మండలం అప్పకొండయ్యగారిపల్లె గ్రామం చింతకుంటవారిపల్లెకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ షేక్.ఆరీఫ్‌కు రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి నివాళులర్పించారు. ఈయన అంత్యక్రియలు ఆదివారం చిన్నమండెం మండలంలోని మల్లూరు కస్పాలో జరిగాయి. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరీఫ్ కుటుంబానికి పరామర్శ

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చింతకుంటపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ షేక్ ఆరీఫ్ కుటుంబాన్ని ఆదివారం టీడీపీ మండల ఇన్‌చార్జి మదన్‌మోహన్ పరామర్శించారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అన్ని విధాలా ఆదుకునేందుకు కృషిచేస్తామన్నారు.

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం

రాయచోటి(కలెక్టరేట్),ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధం లాంటిదని జిల్లా కార్యదర్శి వెంకట్రమణ అన్నారు. గ్రామ పంచాయతీ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు మనకు ఏ సమాచారమైనా అడిగే హక్కు ఉందన్నారు. అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడిగా వాయల్పాడు మండలం చింతపల్లి గ్రామం కదిరి నరసింహులు ఎన్నికయ్యారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా పెద్దతిప్పసముద్రం మండలం టీ సదుం గ్రామానికి చెందిన వెంకటరెడ్డి ఎన్నికయ్యారు. పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం స్పీనర్‌గా తిరుమలరాజు ఎన్నికయ్యారు. పెద్దతిప్పసముద్రం మండలం అధ్యక్షుడిగా కాట్నగాళ్లకు చెందిన గువ్వల హరీశ్ ఎన్నికయ్యారు.

'మేడేను, సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దాం'

రాయచోటిటౌన్, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొని ఉన్న కార్మిక సమస్యలను పరిష్కరించడంలో చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేశ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో రాయచోటి నియోజకవర్గ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు ట్లాడుతూ ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా మారమ్మకు పొంగళ్లు

పుల్లంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేటలోని మెయిన్‌రోడ్డులో వెలసిన మారమ్మ తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారికి మహిళలు పొంగుబాళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. బోనాలు సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

గంగమ్మ జాతరలో జనసేన నేత అతికారి

సిద్దవటం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపల్లె గ్రామంలో ఆదివారం గంగమ్మ జాతరలో జనసేన పార్టీ నాయకుడు నిమ్మకాయల జగన్‌మోహన్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విందులో రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు.

వైభవంగా ముక్తిరామలింగేశ్వరస్వామి రథోత్సవం



ముక్తిరామలింగేశ్వరస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం సైకత లింగానికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి, చండీమాతకు, ఆది శంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీ చక్రానికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజల అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం గంగా రాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామిని శోభాయమానంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. పురవీధుల్లో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తుల శివ నామస్మరణలతో పురవీధులు మారుమ్రోగాయి. డప్పు వాయిద్యాల సందడి, కోలాటం, కళాకారుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కార్యక్రమంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ప్రొద్దుటూరు ఫస్ట్ అడిషనల్ జడ్జి కె.సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారురెడ్డి, ఆలయ చైర్మన్ రాజారెడ్డి, కౌన్సిలర్ వంశీధర్‌రెడ్డి, టీడీపీ మాజీ సభ్యుడు టంగుటూరు మారుతీప్రసాద్, ఆలయ ఈవో శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు.

కాశినాయన జడ్పీటీసీనా.. మజాకా..!

- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తమ్ముళ్ల భూ కబ్జాపై ముమ్మర దర్యాప్తు
- నాడు 'ఆంధ్రజ్యోతి' చెప్పింది అక్షర సత్యం
- రెండ్రోజులుగా డ్రోన్‌లతో పరిశీలన
- ఆక్రమణ దారుల చెరలో 316 ఎకరాలు ఉన్నట్లు ప్రాథమిక నివేదిక
- కబ్జాభూముల్లో జలకళ బోర్లు, కరెంట్ సర్వీసుల గుర్తింపు
- మాజీ సైనికులంటూ బోగస్ పేర్లతో పాగా
- సహకరించిన అధికారులపై ఆరా

కాశినాయన ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో భూ కబ్జాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. వంక, కొండ పోరంబోకులు, డీకేటీలు ఏది కంటబడినా కాజేయాలిందే అన్నట్లుగా సాగింది నాటి పాలన.. నాయనపల్లె సమీపంలోగల సర్వేనెంబర్ 128, 129(1),130లోగల దాదాపు 600 ఎకరాల కొండపోరం బోకు భూమి ఉంది. ఈభూముల్లో వైసీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కుటుంబీకులు కబ్జాకు తెరలేపారు. ఈవిషయం గత సెప్టెంబరులోనే ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. నాటి అధికారులు నేతల ఒత్తిళ్లకు తలొగ్గి ఆభూముల్లో హెచ్చరిక బోర్డులు నాటి వదిలేశారే తప్ప కాపాడలేకపోయారు. ఈ ప్రభుత్వ భూములపై ఎమ్మెల్సీ గోవిందరెడ్డి తమ్ముడు జడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి తన పెద్దనాయన కుమారుడు పెద్ద సత్యం రెడ్డిల కన్నుపడింది. అనుకున్నదే తడువుగా హెచ్చరిక బోర్డులు పీకేశారు. బోగస్ పత్రాలు సృష్టించి బినామీలతో ఆర్మీ పట్టాలు తయారు చేసి కబ్జాలకు పాల్పడ్డారు. పగలు రాత్రనక యంత్రాలతో చెట్లు పీకించి వందల ఎకరాలు చదు నుచేశారు. వారితోపాటు నాయనపల్లె క్రిష్టయ్య కుటుంబీకులు, ఆర్ల చెన్నయ్య, తోడేటి ప్రసాద్, కాశయ్య, సర్వేశ్వర్‌రెడ్డి మరి కొంతమంది భూములు ఆక్రమించు కున్నారు. నాయనపల్లె సమీపంలోని సాలెన్ చెరువు, అడవుల్లోకి పశువులు మేతలకు పోయేదారులను సహితం వదలలేదు. ఇంత జరుగుతున్నా నాటి అధికారులు అటువైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేకపోయారు. గత ఐదేళ్ల కాలంలో వారికి నచ్చిన వ్యక్తిని డీటీగా వేయించుకోవడం అతనికే తహసీల్దారుగా అదనపు బాధ్యలు ఇప్పించుకోవడం మాట వినకపోతే నయానో భయానో పనులు చక్కబెట్టుకొచ్చారు. ఈ భూదందాపై స్థానికులు, అధికారులు ఏమిచేయలేక చేతులెత్తేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారి భూ కబ్జాలపై స్థానికులు జిల్లా అధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాలతో బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ రంగంలోకి దిగారు. పండుగలు సెలవులు పక్కన బెట్టి గత మూడు నాలుగు రోజులుగా రెవెన్యూ అధికారులు నాయనపల్లె సమీపంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను పరిశీలించారు. దాదాపు 316 ఎకరాలు కబ్జా అయిందని అధికారులు తేల్చారు. 316 ఎకరాలు కబ్జా అయినట్లు ప్రాథమిక నివేదిక జిల్లా అధికారులకు ఇచ్చామని.. ఆదివారం కూడా డ్రోన్ సాయంతో సమగ్ర సర్వే చేస్తున్నామని.. కబ్జా ఈవిస్తీర్ణం మరింత ఎక్కువగా ఉంటుందని తహసీల్దారు వెంకటసుబ్బయ్య తెలిపారు. అధికారుల పరిశీలనలో ప్రభుత్వ భూముల్లో జలకళ బోర్లు తవ్వించడం, పెద్ద ఎత్తున అడవుల్లో కరెంట్ లైన్‌లు లాగడం, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం లాంటివి గుర్తించారు. ఇవి ఎలా జరిగాయి ఇందుకు ఎవరు సహకరించారు.. ఇంత జరుగుతుంటే అప్పటి తహసీల్దారులు ఇతర రెవెన్యూ అధికారులు, ట్రాన్స్‌కో సిబ్బంది ఏం చేస్తున్నారు.. కబ్జాదారులకు ఎవరెవరు సహకరించారు.. ప్రభుత్వ పథకాలకు కబ్జాఅయిన భూములను ఎలా వర్తింపజేశారు.. అన్న విషయంపై అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈప్రభుత్వ భూముల్లో చాలా వరకు అరటి తోటలు సాగులో ఉండటం గమనార్హం.



కబ్జాకు గురైన భూముల్లో డ్రోన్‌తో సర్వే చేస్తున్న అధికారులు



నాయనపల్లె సమీపంలో ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

హాస్పిటల్ సిబ్బందిపై మండిపడ్డ ఎమ్మెల్యే



ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్య రెడ్డి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కమలాపురం ప్రభుత్వాసుపత్రిలో విధి నిర్వహణలో ఉండాల్సిన సిబ్బంది కంటే తక్కువ ఉండడంతో ఎమ్మెల్యే మండిపడ్డారు. ప్రజలు ఇచ్చే జీతాలు తీసుకుంటూ వైద్యం చేయాల్సిన వైద్య సిబ్బంది వారిని గాలికి వదిలేసి రిజిస్టర్లలో సంతకాలకే పరిమితం కావడాన్ని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మొదటిసారిని ఇలా మళ్లీ పునరావృతం అయితే అధికారులకు తెలిపి చర్యలు తీసుకునేలా చేస్తామని హెచ్చరించారు. ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా బ్రెడ్లు, పండ్లు రోగులకు పంపిణీ చేసేందుకు ఆదివారం ఎమ్మెల్యే ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యం కోసం ప్రజల పట్ల కొందరు దురుసుగా కూడా ప్రవర్తిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని.. అలాంటి వారిని ఉపేక్షించేది లేదదన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఏర్పాటు చేసిన 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభి వృద్ధి చేయాలని ధ్యేయంతో తాము పనిచేస్తుంటే... ఇక్కడ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి... ఇద్దరు మృతి

బద్వేలుటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లె ఫారెస్ట్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడటంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. బద్వేలు నియోజకవర్గ పరిధిలోని అట్లూరు మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన మల్లి రామసుబ్బమ్మ, యానదయ్య కుమారుడు నరసింహ(26), బద్వేలు పట్టణ పరిధిలోని రూపరాంపేట ప్రాంతానికి విజయమ్మ శివ దంపతుల కుమార్తె ఝాన్సీ (25)లు ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో మృతి చెందారు. మృతులు ఇరువురూ శనివారం తమ స్నేహితులతో కలసి పంక్షన్‌కు వెళుతున్నామంటూ చెప్పి వెళ్లారు. ఆదివారం నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కదిరి నాయుడుపల్లె ప్రధన రహదారిలోని ఫారెస్ట్ ప్రాంతంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి ఝాన్సీ అక్కడికక్కడే మృతి చెందగా, కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న నరసింహులును బాటసారులు 108వాహనం ద్వారా బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలిం చగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతులు ఇరువురూ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో విధులు నిర్వహించేవారు. నరసింహులుకు 8 నెలల క్రితం రాజుపాలెంకు చెందిన కళ్యాణితో వివాహం జరిగింది. దీంతో ఇరువురి కుటుంబాల్లో విషాదచాయలు అలుముకున్నాయి.



నరసింహ (ఫైల్‌ఫొటో)



ఝాన్సీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సెప్టిక్ ట్యాంకు శుభ్రం చేయడానికొచ్చి..
గుంతలోపడి ఒకరి మృతి

- మరొకరి పరిస్థితి విషమం



హేమంత్ మృతదేహం

పుంగనూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సెప్టిక్ ట్యాంకు శుభ్రం చేయడానికొచ్చి.. గుంతలోపడి ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా పుంగనూరు శాంతినగర్ ఆరో వీధికి చెందిన మాజీ సైనికుడు యుగంధర్ నాయుడు ఇంట్లో సెప్టిక్ ట్యాంకు శుభ్రం చేయడానికి అన్నమయ్య జిల్లా మదనపల్లె సంతపేటకు చెందిన హేమంత్(26), కర్ణాటక రాష్ట్రం రాయల్పాడుకు చెందిన రవి ఆదివారం సాయంత్రం వెళ్లారు. సెప్టిక్ ట్యాంకు శుభ్రం చేస్తుండగా, ప్రమాదవశాత్తూ గుంతలో హేమంత్ పడిపోయాడు. అతడిని కాపాడబోయిన రవి కూడా అందులో పడ్డాడు. గమనించిన యజమాని కేకలు వేయడంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. అగ్నిమాక సిబ్బంది వచ్చి.. స్థానికుల సాయంతో రవి, హేమంత్‌లను ట్యాంకు నుంచి బయటకు తీశారు. అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే హేమంత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. రవి పరిస్థితి విషమంగా ఉండటంతో మదనపల్లెకు తరలించారు. రూరల్ ఎస్‌ఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ, టీడీపీలు రాష్ట్రానికి రాహు కేతువులు

- పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ, టీడీపీలు రాహు కేతువులుగా దాపురించాయని, దొందూ-దొందేనని రాజ్యసభ మాజీ సభ్యుడు, పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ తన పాలనలో అరచేతిలో వైకుంఠం చూపి తే... చంద్రబాబు కైలాసం చూపిస్తు న్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుంచి నిప్పుల పొయ్యిల పడ్డట్లుగా తయారైందని విమర్శించారు. జగన్ ప్రభు త్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా, అరాచక, ఆటవిక, మద్యం, డ్రగ్స్, గంజాయి ఆంధ్ర ప్రదేశ్‌గా తయారు చేసి వెళ్లి పోయిందన్నారు. ఇక చంద్రబాబు పనితీరు అందుకు భిన్నం కాదని.. మండలానికి నాలుగు మద్యం షాపు లు, బెల్టుషాపుల హోరు సాగుతోందన్నారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్లు అదనపు భారం మోపిం దని, సూపర్ సిక్స్ హామీలు ప్లాప్ అయ్యా యని, నిరుద్యోగ భృతి ఎక్కడంటూ విమ ర్శించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి సీమలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రె స్ కమిటీ ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, ప్రసా ద్‌గౌడ్, ఏకాదశి రెడ్డి, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, రాష్ట్ర మాజీ నేతలు సత్తార్, సుబ్బారెడ్డి, శ్యామలమ్మ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో అపశ్రుతి



ఖాజీపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తుడమలదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకాళమ్మ విగ్రహ ప్రతిష్ఠలో అపశ్రుతి చోటుచేసుకుంది. గుడిని ప్రారంభించి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం గరుడస్తంభం క్రేన్ సహాయంతో ఏర్పాటు చేస్తుండగా ఒక్కసారిగా రెండు ముక్కలై గుడిపై ఒక ముక్క, మరో భాగం నిటారుగా నిలవడంతో భక్తులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా జిల్లా పరిషత్ చైర్మన్ రాంగోవిందురెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నందిపల్లెలో ఘర్షణ

వేంపల్లె, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపల్లెలో ఆదివారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. నందిపల్లెకు చెందిన మున్వర్ ఇంటి వద్దకు పంచాయతీ నెపంతో వీరపునాయునిపల్లె మండలానికి చెందిన చిన్న బాదుల్లా, పెద్దబాదుల్లాతో పాటు వేంపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు అబ్దుల్ వెంట పలు వురు యువకులు వెళ్లారు. ఈ సందర్భంగా వాదోపవాదాలు జరిగి మున్వర్‌తో పాటు బావ, అక్క సలీమ మీద దాడి చేశారు. ఈ ఘటనలో సలీమకు చేయి విరిగింది. ఈ సందర్భంగా గ్రామస్థులు పెద్దఎత్తున చేరుకోవడంతో అక్కడకు వచ్చిన అల్లరి మూక పరారైంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐలు రంగారావు, తిరుపాల్‌నాయక్‌లు ఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని అదు పులోకి తెచ్చారు. కాగా, దాడిచేసేందుకు వచ్చిన వారిని వదిలివేసిన ఎస్‌ఐ తీరుపై గ్రామస్థులు అసంతృప్త వ్యక్తం చేశారు.

ఉప మండలాధ్యక్షుడిపై కేసు నమోదు

మైదుకూరు రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్ర జ్యోతి): మైదుకూరు ఉప మండలాధ్యక్షుడు ఊటకూరు రఘురామిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. తువ్వపల్లెకు చెందిన ఓ మైనర్ బాలికకు రఘురామిరెడ్డి ఆశ్రయం ఇచ్చి వివాహం చేయాలని చూశారు. ఈ మేరకు బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన పోలీసులు ఆదివారం రఘురామిరెడ్డిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అర్హులైన ఉద్యోగులకు త్వరలో ఇంటిస్థలాలు

- ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

కడప, కలెక్టరేట్, ఏప్రిల్ 20, (ఆంధ్రజ్యోతి): ఎన్జీవో సంఘంలో దీర్ఘకాలంగా సభ్యత్వం ఉండి, ఇంకా ఇంటి స్థలాలు రాని ఉద్యోగులకు ఇంటి స్థలాలు వచ్చేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం నగరంలో ఎన్జీవో కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ కార్యాలయంలో ఆసంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ స్థలం రాని సభ్యులకు ఇంటి స్థలాలు ఖచ్చితంగా సాధించి అర్హులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి రవికుమార్, హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు కొండారెడ్డి, డైరెక్టర్లు, అధ్యక్ష, కార్యదర్శులు, రిటైర్డ్ ఉద్యోగులు, సభ్యులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు యువకుడు మృతి



భాను ఓబులేసు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

పెద్దముడియం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్నముడియం గ్రామ శివారులో పంట పొలంలో ఆదివారం మధ్యాహ్నం 4గంటల ప్రాంతంలో పిడుగుపాటుకు భాను ఓబులేసు (22) అనే యువకుడు మృతి చెందాడు. జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన దండు నాగసుబ్బరాయుడు అతని కొడుకు భాను ఓబులేసులు తమ పొలంలో సాగు చేసిన కొర్రపంటకు నీరు పెట్టేందుకు ఆదివారం ఉదయం వచ్చారు. మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత పని చేసుకుంటుండగా ఒక్కసారిగా గాలి, వాన రావడంతో ఇంటికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో సమీపంలోని పొలం గట్టు వద్ద పిడుగు పడడంతో భాను ఓబులేసు అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలో ఉన్న తండ్రి కొడుకు చనిపోయి ఉండడం చూసి బోరున విలపించారు. విషయం బంధువులకు తెలపడంతో వారు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కన్నీంటి పర్యంతమయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

జూన్, జూలైలో వైవీయూ స్నాతకోత్సవాలు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం 11, 12, 13, 14వ స్నాతకోత్సవాలను జూన్, జూలై నెలల్లో నిర్వహిస్తున్నట్లు వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కేఎస్‌వీ కృష్ణారావు వెల్లడించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాస రావు తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలి పారు. వివరాలకు హెచ్‌టీటీపీ: //కాన్వకేషన్.వైవీయూఎగ్జామ్స్.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

వేడుకగా మారెమ్మతల్లి జాతర

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నిండుకుండ బోనాలు

కడప కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నగర 49వ డివిజన్ ఆలంఖాన్ పల్లెలో వెలసిన మారెమ్మతల్లి ఆలయ 21వ వార్షికోత్సవం సందర్భాన్ని పుర ష్కరించుకుని ఆదివారం జాతర మహోత్సవం వేడుకగా జరిగింది. తెల్ల వారుజాము నుంచే అమ్మవారికి భక్తి శ్రద్ధలతో నిండుకుండ బోనాలు సమ ర్పించి మొక్కుబడులు చెల్లించారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆలయానికి చేరుకుని గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని శరణు కోరారు. అనంత రం ఆలయ కమిటీ సభ్యుడు రెడ్డిచెర్ల జయరామిరెడ్డి పిలుపుమేరకు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు, టీడీపీ యువ నాయకుడు జి.మన్‌మోహన్‌రెడ్డి ఆలయా నికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో వారు పాల్గొన్నారు.



నిండుకుండ బోనాలను సమర్పిస్తున్న మహిళలు

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

జాతర సందర్భంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి గ్రామంలో న్యూ కేటగిరీ విభాగం వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఇందులో ఆలంఖాన్‌పల్లెకు చెందిన రెడ్డిచెర్ల వెంకటరామిరెడ్డి ఎద్దు ప్రథమ విజేతగా నిలిచి రూ.50వేలు, రూకావారిపల్లెకు చెందిన విద్య ఓబుల్‌రెడ్డి ఎద్దు ద్వితీయ విజేతగా నిలిచి రూ.40 వేలు, బాలయ్యగారిపల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్దు తృతీయ విజేతగా నిలిచి రూ.30 వేలు, నాల్గవ విజేతగా సతీష్ కుమార్‌రెడ్డి, ఐదవ విజేతగా విశ్వనాథరెడ్డి, ఆరవ విజేతగా రామక్రిష్ణారెడ్డి ఎద్దు నిలిచాయి. వారికి నగదు బహుమతులు అందించారు. అనంతరం సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన కోలాటం ప్రజలను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పెద్దఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం


మదనపల్లె: కేక్ కట్ చేస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, నాయకులు


పీలేరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు


తంబళ్లపల్లెలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు


పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఎన్‌ఆర్‌ఐ లోకేశ్ టీమ్

చంద్రబాబు గొప్ప దార్శనికుడు

- మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా
- అన్ని ప్రాంతాల్లో ఘనంగా జన్మదిన వేడుకలు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురోగతికి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు గొప్ప దార్శనికుడని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. ఆదివారం సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే తన నివాసం వద్ద కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నిమ్మనపల్లె సర్కిల్ వద్ద ఆర్‌జే వెంకటేశ్, మున్సిపల్ కౌన్సిలర్ తులసి, రామకృష్ణాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బెంగళూరు బస్టాండు వద్ద రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్‌ఖాన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అన్నదానం చేశారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రామారావు విగ్రహానికి నివాళులర్పించారు. నీరుగట్టువారిపల్లెలో మోడెం సిద్దప్ప, నీలకంఠ, బొమ్మిశెట్టి పురుషోత్తం ఆధ్వర్యంలో. పీటర్‌రాక్ చర్చిలో టీడీపీ క్రిస్టియన్ విభాగం నేత జాన్‌బాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. టీడీపీ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, ఎస్‌ఏ మస్తాన్, శివన్న, షంషీర్, శేఖర్, మధు, పూలకంట్ల హరి, నవీన్, తదితరులు పాల్గొన్నారు. దేవతానగర్‌లోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు రాటకొండ రెడ్డెప్పరెడ్డి(బాబురెడ్డి) కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో గంగారపు బాబురెడ్డి, గౌతమ్‌రెడ్డి, ఆర్‌జే వెంకటేశ్, దొరస్వామినాయుడు, చింటు, బాస్కరాచారి, తదితరులు పాల్గొన్నారు. ఎన్‌ఆర్‌ఐ లోకేశ్ కొణెదల ఆధ్వర్యంలో 20 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 10 వేలు నగదు, విద్యాసామగ్రి అందజేశారు. కొణిదల గౌతమ్, పెరవలి నవీన్, నిరంజన్‌నాని, పఠాన్ ఖాదర్‌ఖాన్, ప్రభాకర్, మహేష్, వంశీనరసింహ, గగన్‌సాయి, సురేంద్ర, బావాజాన్, శివ తదితరులు పాల్గొన్నారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పూరి రమేశ్ ఆధ్వర్యంలో శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. రాటకొండ గురుప్రసాద్, స్టూడెంట్స్ జేఏసీ నాయకులు ఉత్తన్న, రాజేష్, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

మదనపల్లె : స్థానిక బెంగళూరు బస్టాండులో హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా చేతుల మీదుగా కేట్ కట్ చేసి పంచిపెట్టారు.

నిమ్మనపల్లి: మండల కేంద్రంలో ఎమ్మెల్యే ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కారణం చంద్రబాబు నాయుడని తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు రెడ్డెప్ప రెడ్డి, ఆర్జే వెంకటేష్, రాజన్న, మహమ్మద్‌రఫీ, రమణ, మురళి, విజయ్, మల్లప్ప, సురేష్, తానేశ్వర్, శ్రీపతి పాల్గొన్నారు.

పెద్దమండ్యం: మండల కేంద్రంలో మండల టీడీపీ కన్వీనర్ జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మండల టీడీపీ నాయకులు హసీంసాబ్, నార శ్రీనివాసులు, బిక్కామధుకర, వేంపల్లి రఫీ, ఓబులేసు, తిమ్మయ్య, తులసీదర్‌నాయుడు, మదార్, రమేష్, రఘునాధ, పెద్దన్న, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ: ఎంపీడీవో కార్యాలయంలో మండల టీడీపీ అధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రాజంపేట పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు దద్దాల హరిప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో చెర్లోపల్లెలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లుట్ల మురళీ, ప్రసాద్‌నాయుడు, నౌషాద్‌అహ్మద్, చలమారెడ్డి, ఆనంద్, విజయ్‌కుమార్, ఎండీ.జమీర్, నౌషాద్‌అలీ, పర్వేజ్, బాబాజాన్, హరియాదవ్, రామచంద్ర, సాగర్, సుధాకర్ పాల్గొన్నారు.

కలకడ: స్థానిక టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.నాయకులు ప్రభాకర్‌నాయుడు, మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, అబ్బూరి తిరుపతినాయుడు, కోటరమణ నాయుడు, తారకేశ్వర, ఆనంద్‌రెడ్డి, శ్రీహరినాయుడు పాల్గొన్నారు.

పీలేరు: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో కేక్ కట్ చేశారు. పేదలకు అన్నదానం చేశారు. ఏఎంసీ అధ్యక్షుడు పురం రామ్మూర్తి, నాయకులు కోటపల్లె బాబు, శ్రీకాంత్ రెడ్డి, లడ్డూ జాఫర్, మల్లెల రెడిబాషా, అమరనాథరెడ్డి, స్పోర్ట్స్ మల్లి, పోలిశెట్టి సురేంద్ర, షౌకత్‌అలీ, అతార్ చాను, రహంతుల్లా, సుబ్బయ్య, శ్రీనాథరెడ్డి, కంచి సూరి, నల్లారి రియాజ్, సాధన, రమాదేవి, లక్ష్మీకాంతమ్మ, ముబారక్, రెడిముని, వెంకటరమణ నాయక్, షామియాన జయన్న, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కురబలకోట: రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్ భాషా ఆధ్వర్యంలో మండలంలోని అంగళ్లు మూడు రోడ్ల కూడలి, ముదివేడు బస్టాండు తదితర ప్రాంతాల్లో కేక్‌కట్ చేసి స్వీట్లు, పండ్లు పంచి పెట్టారు. మండల టీడీపీ అధ్యక్షుడు వైజీ సురేంద్ర, మాజీ ఎంపీపీలు జి.వెంకటరెడ్డి, తిమ్మరాయుడు, వెంకటరమణారెడ్డి, మోహన్‌రెడ్డి, ఇస్మాయిల్, అఫ్జల్, ఇందాద్, రెడ్డిశేఖర్‌రెడ్డి, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : స్థానిక బస్టాండులో జయచంద్రారెడ్డి వర్గీయులు కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు. తరువాత అదే స్థలంలో శంకర్ వర్గీయులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. జయచంద్రారెడ్డి వర్గీయులు సంపతికోట కిట్టన్న, కట్టా సురేంద్ర నాయుడు,బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, చిన్నపరెడ్డి, మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్, మాజీ ఎంపీటీసీ చిన్నా, స్కూల్ కమిటీ చైర్మన్ రాము, మాజీ ఎంపీటీసీ సూరి, గంగులప్ప, శంకర్ వర్గీయులు మాజీ జడ్పీటీసీ గూటం ఈశ్వరప్ప, మండల టీడీపీ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, తాడిగోళ్లపల్లె సుధాకర్‌రెడ్డి, చింతకాయల


నిమ్మనపల్లి: చంద్రబాబు జన్మదినవేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

వినోద్, తదితరులు పాల్గొన్నారు.

కలికిరి: స్థానిక అమరనాథ రెడ్డి భవన్‌లో కేకు కట్‌చేసి పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మాలతి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, రెడ్డెప్ప రెడ్డి, దినకర్‌బాబు, శ్రీనివాస వర్మ, చిన్నరెడ్డెయ్య, అబ్దుల్ ఖాదర్, రత్నశేఖర్ రెడ్డి, వైజాగ్ బాషా, ఏసురాజు, అస్లామ్ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: నియోజకవర్గ ఇన్చార్జి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఓ వర్గం కేక్‌కట్ చేసి పంచి పెట్టింది. కొండాసెంటర్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ అన్నదాన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. పార్టీ మండల కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, కుడుం శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు. చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలంటూ స్థానిక శివాలయంలో మహారుద్రాభిషేకం చేయించారు. లోకనాథ్‌రెడ్డి, గంజిమోహన్, బంగారువెంకట్రమణ, దేవరింటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు చంద్ర, రాష్ట్ర బీసీ నాయకుడు తులసీధర్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ బేరి శీన, మదన తదితరులునివాళులర్పించారు. స్థానిక ఎన్టీఆర్ ఘాట్ వద్ద కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. బీసీ నాయకుడు పురుషోత్తం ఎస్‌ఎంసీ ఛైర్మన్ వీరాంజనేయులు, పార్లమెంట్ రైతు ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, తెలుగు యువత నరసింహులు, రాజన్న తదితరులు ఎన్టీఆర్ ఘాట్ వద్ద కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు.

రామసముద్రం:మండలం టీడీపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో భారీ కేక్ కట్ చేశారు. చెంబకూరు మాజీ సర్పంచ్ తిప్పన్న, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మునివెంకటస్వామి, రూపేష్‌రెడ్డి, బద్రీనాథ్, వికాస్, స్వామి, ప్రశాంత్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్డిశేఖర్, మేస్త్రీ రామచంద్ర, బందెల శివ, రామమూర్తి, గంగాని వెంకటేష్, శీన, కొండామరి అనిల్ కుమార్‌రెడ్డి, మహ్మద్, ఎంఆర్‌పీఎస్ నాయకులు గంగాధర్ పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

ములకలచెరువు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా స్థానిక బస్టాండు సర్కిల్‌లో టీడీపీ యువనేత కట్టా దొరస్వామి నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా 75 కేజీల కేక్‌ను కట్ చేసి పంచిపెటారు. అనంతరం భారీ ఎత్తున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చరపల్లి అనీల్, కట్టా విజయ్‌నాయుడు, షేక్ నజీబ్, మేదరమట్ల హరికృష్ణ నాయుడు, చెన్నకిష్టా, వెంకటస్వామి, కేశవులు, నాగరాజుయాదవ్, శంకర్‌నారాయణ, శివన్న, గాండ్ల రెడ్డెప్ప, సుధాకర్‌నాయుడు, ప్రతాప్‌నాయుడు, ఉమాశంకర్, జహీర్, కక్కల సుదర్శన్, బసివి శ్రీని వాసులు, నారాయణస్వామినాయుడు, భూపతి, ఆదినారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న దొరస్వామినాయుడు, మండల టీడీపీఅధ్యక్షుడు పాలగిరి సిద్ధా

జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం

ములకలచెరువు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా స్థానిక బస్టాండు సర్కిల్‌లో తంబ ళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సీడు మల్లికార్జున నాయుడు, మంత్రి గిరిధర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ అన్నదానం చేశారు. అంతకు మునుపు 75 కేజీల కేక్‌ను కట్ చేశారు. కురబలకోట మండల అధ్యక్షుడు వైజీ సురేంద్రయాద్, కట్టా సురేంద్రనాయుడు, భజంత్రి రామాంజులు, ఆంజనేయరెడ్డి, రెడ్డెప్ప, మొటుకు శివ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న టీడీపీ నేతలు మల్లికార్జుననాయుడు, గిరిధర్‌రెడ్డి

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

వాల్మీకిపురం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిగుంటపల్లె సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సీఐ ప్రసాద్‌బాబు, ఎస్‌ఐ చంద్రశేఖర్, దాడులు నిర్వహించారు. 9 మందిని అరెస్టు చేసి రూ.4వేలు నగదు, నాలుగు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. కర్ణాటకలోని ఊడలవాండ్లపల్లె వైపు వెళుతున్న బొలెరో వాహనం కందుకూరువైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో దానిపై ప్రయాణిస్తున్న జాఫర్ (27), షానవాజ్ (25) తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక రైతులు వారిని కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. మదనపల్లె నుండి అవుట్ పోస్టు పోలీసులు సమాచారం అందించడంతో పీటీఎం ఎస్‌ఐ హరిహరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

దంపతులపై దాడి.. కేసు నమోదు

కలకడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దంపతులపై దాడి చేసినందుకు ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ రమేష్‌బాబు తెలిపారు. బొజ్జగుంటపల్లె వడ్డిపల్లెకు చెందిన చంద్రయ్య ఆదే గ్రామానికి చెందిన రమణప్రసాద్ ఇంటికి వెళ్లి దైవ కార్యక్రమానికి చందా అడిగాడు. ఈ క్రమంలో రమణప్రసాద్ అతని భార్య లక్ష్మీదేవితో గొడవపడి దాడి చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


మేఘన మృతదేహం

రామసముద్రం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దిగువ హరిజనవాడకు చెందిన శివ భార్య మేఘన శనివారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో మృతురాలి తండ్రి సుబ్రహ్మణ్యం రామసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

పీలేరు రూరల్ 20 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు అప్రమత్తంగా వ్యవహరించాలని పీలేరు అగ్నిమాపక కేంద్ర అధికారి ఎస్. మస్తాన్ తెలిపారు. ఆదివారం పీలేరు పట్టణం కడప మార్గంలోని అగ్ని మాపక కేంద్రం వద్ద వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుంచి వారం రోజులపాటు పీలేరు పట్టణంలో పలు చోట్ల అగ్ని ప్రమాదాలపై అవగా హన సదస్సులు నిర్వహించామని చెప్పారు. అగ్నిప్రమాదాలు జరిగినపుడు ఆందోళన చెందకుండా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతోపాటు ఇరుగుపొరుగు వారిని అప్రమత్తం చేయాలన్నారు. గ్యాస్, అయిల్, విద్యుత్ తీగల మంటలు ఆర్పే విధానాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాలు జరిగినపుడు వెంటనే 101, 08584 244399, 9963736587 నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కే. నాగిరెడ్డి, ఎం. హేమాద్రి రెడ్డి, జీ. కృష్ణమూర్తి, కే. శ్రీనివాసులు, ఎం. వెంకటేష్, ఏ. రెడ్డి శేఖర్, డీ. మహబూబ్ బాషా, డీ. చైతన్య కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నా రు.


పీలేరు సమావేశంలో మాట్లాడుతున్న అగ్నిమాపక అధికారి మస్తాన్

మదనపల్లె అర్బన్ : అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అగ్నిమాపక కేంద్రానికి విచ్చేసిన విద్యార్థులకు అగ్నిమాపక పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప మాట్లాడుతూ ప్రజలు అగ్నిమాపక నివారణ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు, పిల్లలు చెరువులు, బావులు వద్ద ఈతకు వెళ్లినప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎటువంటి అగ్ని ప్రమాదాలైనా 101, 08571-222101కు సమాచారం ఇవ్వాలని కోరారు. వారోత్సవాల్లో చివరి రోజు కావడంతో మదనపల్లె అగ్నిమాపక కేంద్రంలో అధికారులు రక్తదానం చేశారు. మదనపల్లె, ములకలచెరువు, వాయల్పాడు సిబ్బంది పాల్గొన్నారు.


వాల్మీకిపురం:విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

వాల్మీకిపురం : ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు ప్రమాదాలపై అవగా హన కల్పించారు. ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదంలో చిక్కుకున్నవారిని రక్షించడంపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక కేంద్ర అధికారి బాబయ్య, ఫైర్‌మెన్ కిరణ్ కుమార్, శ్రీనివాసులు, ఆపరేటర్లు రాజగోపాల్ నాయక్, ఫైర్ సిబ్బంది మురళీ మోహన్ నాయక్, కిరణ్‌బాబు, రవి, ఇమ్రాన్‌బాషా, భాస్కర్ పాల్గొన్నారు.

గాలివానకు విరిగిన విద్యుత్ స్తంభం

పీలేరు రూరల్ 20 (ఆంధ్రజ్యోతి): గాలివాన కారణంగా పట్టణంలోని బోయపాళ్యం వీధిలో విద్యుత్ స్తంభం విరిగి పడింది. అదే సమయంలో విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం మధ్యాహ్నం గాలివాన పీలేరు పట్టణాన్ని కుదిపేసింది. పలు చోట్ల వృక్షాలు నేలకొరిగాయి. బోయపాళ్యంలో చెట్టువిరిగి విద్యుత్ స్తంభంపై పడడంతో అది విరిగిపోయింది. స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఏఈ ఇలాహీ సంఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభించారు. రైల్వేష్టేషన్ వద్ద చెట్లు విరిగిపడ్డాయి. రెండు గంటలు అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


విరిగి పడిన విద్యుత్ స్తంభం

మాంసం వ్యాపారులు పరిశుభ్రత పాటించాలి

రామసముద్రం, ఏప్రిల్ 20(ఆంధ్ర జ్యోతి): మాంసం దుకాణాల్లోని వ్యర్థాలను మెయిన్ రోడ్ ప్రక్కన, మురుగు కాలువల్లో పడేస్తూ పరిసరాల పరిశుభ్రతకు భంగం కలిగిస్తున్నారని, అలాంటివారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఈవోఆర్‌డీ గఫూర్ హెచ్చరించారు. చికెన్, మటన్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో వేయరాదని దుకాణదారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చినా, నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. గ్రామానికి సుమారు కిలోమీటరు దూరంలో గోతులు తీసి అందులో వ్యర్థాలను వేసుకోవాలన్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, వ్యర్థాలను రోడ్డుపై వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చేస్తున్నారు.


రోడ్డు పక్కన పడేసిన చికెన్ వ్యర్థాలు

వివాహిత అదృశ్యం

రామసముద్రం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై రామసముద్రం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు కమ్మవారిపల్లె పంచాయతీ ఎర్రబోయనపల్లెకి చెందిన డేరంగుల రామాంజులు భార్య మానస రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు గాలించారు. ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి రామచంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశాడు


మానస

జూదరుల అరెస్ట్

పీలేరు రూరల్,ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పది మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు కేవీపల్లె ఎస్‌ఐ వి. చిన్నరెడ్డెప్ప తెలిపారు. వగళ్ళ పంచాయతీ నారమాకులపల్లె సమీపంలోని పేకాట కేంద్రంపై దాడిచేసి 10 మందిని అరెస్ట్ చేయడంతోపాటు రూ. 21,630 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సమాజానికి అం బేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయక మని జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణ కల్యాణమండంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయనతోపాటు కదిరి మాజీ ఎమ్మెల్యే మిట్ట పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి ముని సుబ్రహ్మణ్యం అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులకు భారతరత్న ప్రకటించుకున్న కాంగ్రెస్ పార్టీ జాతి యావత్తు గర్వించదగ్గ అంబేడ్కర్‌కు మాత్రం ప్రకటించ లేకపోయిందని ఆరోపించారు. బీజేపీ దేశ ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో అంబేడ్కర్ జన్మించిన ప్రాంతం జన్మభూమిగా, ఆయన ఉన్నత విద్యను అభ్యసించిన ముంబాయిలోని ప్రాంతాన్ని చైత్రభూమిగా అభివృద్ధి చేసి గౌరవించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఆనంద గజపతిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్లంపల్లె ప్రశాంత్, కృష్ణమూర్తి, కృష్ణయాదవ్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు పిల్లస్వామి నాయక్, అసెంబ్లీ కన్వీనర్ భగవాన్, కో కన్వీనర్ మధు, బర్నేపల్లె రవికుమార్, నరేంద్ర కుమార్‌రెడ్డి, బండి ఆనంద్, భువనేశ్వర్ సత్య, సునితాఆ, బాలజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

గెజిటెడ్ ఆఫీసర్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మదనపల్లె గెజిటెడ్ ఆఫీసర్స్ క్లబ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక సీటీఎం రోడ్డులోని గెజిటెడ్ ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా వి.జనార్దన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కోటేశ్వరరావు, కోశాధికారిగా రామరాజు, కార్యవర్గ సభ్యులుగా వైఎస్ మునిరత్నం, గోపాలనాయుడు, కోదండరామిరెడ్డి, రామస్వామిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మదనపల్లె విద్యార్థికి 40వ ర్యాంకు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో మదనపల్లెకు చెందిన అబుల్ రహీం ఇంటర్మీడియట్‌లో 987 మార్కులు సాధించగా, జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 40వ ర్యాంకు సాధించాడు. గౌతమ్ లాల్, షారిబా దంపతుల కుమారుడు అబ్దుల్ రహీం జేఈఈ మెయిన్స్‌లో 99.97 పర్సంటైల్ సాధించి మదనపల్లెకు మంచి పేరు తెచ్చిపెట్టాడు. భాష్యం హైస్కూల్ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్ అభినందించారు.


అబ్దుల్ రహీం

క్రికెట్ టోర్నీ విజేత గణేష్ జట్టు


క్రికెట్ టోర్నీ విజేత గణేష్ జట్టు

పీలేరురూరల్ 20 (ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం రేగళ్లలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో ఆల్‌రౌండ్ ప్రతిభ కనపర్చి గణేష్ జట్టు విజేతగా నిలిచింది. పీలేరు మండలం రేగళ్లలో మూడు రోజు లుగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. సుమారు పది జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గణేష్, లియాఖత్ జట్లు తలపడ్డాయి. లియాఖత్ జట్టు నిర్ణీత 7 ఓవర్లలో 51 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గణేష్ జట్టు 6.5 ఓవర్లలో 53 పరుగులు చేసి రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టోర్నీ విజేత గణేష్ జట్టుకు రూ. 10,116, రన్నర్స్ లియాఖత్ జట్టుకు రూ. 7116 నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ నిర్వాహకులు లియాఖత్, షామీర్ క్రీడాకారులను అభినందించారు.

నూతన కాలువలో మహాభారత యజ్ఞం ప్రారంభం

పీలేరు రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కేవీపల్లె మండలం నూతనకాలువలో ఆదివారం నేపల్లెమ్మ దేవస్థానం, స్థానిక ప్రజలు మహాభారత యజ్ఞం ప్రారంబించారు. ఈ కార్యక్రమం మే ఒకటో తేదీ వరకు ఉంటుందని నిర్వాహకుడు పసుపులేటి చినబాబు తెలిపారు. పగటి కథ శ్రీమతి రెడ్డిరాణి, రాత్రి నాటకం రాయచోటికి చెందిన శ్రీ మహేష్ నాట్యకళామండలి వారు ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు.

500 మందికి ఆయుర్వేద వైద్య పరీక్షలు


ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ప్రొఫెసర్లు, వైద్యులు

ములకలచెరువు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో ఆదివారం రాష్ట్ర ఆయుష్ పారంపర్య వైద్య సంఘం అధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ ముక్తియార్, తహసీల్దార్ ప్రదీప్, ఆయుర్వేద ద్రవ్యగుణ శాస్త్ర నిపుణులు బులుసు సీతారాం, బాబు, రాజేంద్రప్రసాద్, మందుల తయారీ నిపుణుడు రామచంద్రారెడ్డి తదితరులు ప్రారంబించారు. ఈ సందర్భంగా 500 మందికిపైగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఔషధ తనిఖీ విభాగానికి చెందిన డాక్టర్ రాంకుమార్, వైద్యులు సులేమాన్, మహిళల ఆరోగ్య నిపుణులు డాక్టర్ రాఫియా ఫిర్దోస్, తస్లీం, రేవతి తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్ గోల్డెన్ జూబ్లీకి నిర్ణయం

ములకలచెరువు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తాము అక్షరాలు నేర్చుకున్న పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకుంది... దీంతో వేడుకలు నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. ములకలచెరువు జడ్పీ హైస్కూల్ ఏర్పాటు చేసి 50 ఏళ్ళు పూర్తి చేసుకోవడంతో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. వచ్చే నెల 31వతేదీన 50 వసంతాల వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తీర్మానించారు.

145 మంది రక్తదానం

కురబలకోట,ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని వైస్ ప్రిన్సిపాల్ కమాల్‌భాషా అన్నారు. ఆదివారం మండలంలోని అంగళ్ల సమీపంలోని మిట్స్ కళాశాలలో ఎస్‌వీఎస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 145 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సి పాల్ కల్పన, బాలచంద్రనాయుడు, డాక్టర్ చెన్నయ్య, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

తంబళ్లపల్లె ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ సందర్భంగా మండలంలోని చర్చిలన్నీ ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం ఉదయం క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలోని సీఎస్‌ఐ చర్చిలో పాస్టర్ ఈస్టర్ ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు.


ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

అక్రమంగా మట్టి తరలిస్తున్నట్రాక్టర్ల సీజ్

కురబలకోట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టిని తవ్వి, తరలిస్తున్న ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లను ఆదివారం పోలీసులు సీజ్ చేశారు. వీఆర్వో కథనం మేరకు మండలంలోని అంగళ్ళు పంచాయతీ గుర్రాలవారిపల్లె సమీపంలో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారని సమాచారం అందడంతో వీఆర్వో ఖాదర్‌బాషా అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసు లు అక్కడికి చేరుకుని ఎక్స్‌కవేటర్‌ను, ట్రాక్టర్‌లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్లు